# నా జీవితం ప్రజాసేవకే అంకితం



మామిడిపల్లిలో మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, నవంబరు 24: నా జీవితం ప్రజా సేవకే అంకితమని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శుక్రవారం ఐదు పంథల మున్నూరు కాపు సంఘం సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఆర్మూర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పదేండ్లలో చేపట్టిన పనులను వివరించారు. అసత్య ప్రచారం చేస్తున్న బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. మూడో సారి సైతం విజయం తనదేనన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పండిత్ పవన్, అయ్యప్ప శ్రీను, రవిగౌడ్, ఐదు పంథల సభ్యులు పాల్గొన్నారు.

### మంథనిలో ఇంటింటా ప్రచారం

ఆర్మూర్, నవంబర్24: మండలంలోని మంథని గ్రామంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వెళ్లిన జీవన్‌రెడ్డికి ప్రజలు, యువకులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని వివిధ కుల సంఘాల ప్రతినిధులను ఎమ్మెల్యే కలిసి ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపాలని కోరారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతు కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



నందిపేట్‌లో జీవన్‌రెడ్డికి ఏకగ్రీవ తీర్మానం కాపీ అందజేస్తున్న మైనార్టీ నాయకులు

### బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నందిపేట్/ఆర్మూర్‌టౌన్, నవంబర్ 24 : సీఎం కేసీఆర్ పాలనలో అన్ని కులాలు, మతాలకు సమాన గౌరవం లభిస్తోందని నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. నందిపేట్ మండల కేంద్రంలో శుక్రవారం మైనార్టీ పెద్దలు జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లోని మసీదులకు చెందిన మైనార్టీలు, జమాతే కమిటీలు బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఆలోచించి ఓటేయాలని, బీఆర్‌ఎస్‌కు పట్టంకట్టి అభివృద్ధిని గెలిపించాలని కోరారు. ఆర్మూర్ పట్టణంలోని జమాతే ఉల్మా ఐ హింద్ సభ్యులు, మైనార్టీలు గురువారం రాత్రి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి మద్దతు తెలిపారు.

# బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

నందిపేట్/ఆర్మూర్, నవంబర్ 24: ఆర్మూర్, నందిపేట్ మండలాలకు చెందిన వందలాది మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు వారి అనుచరులతో సహా శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అర్సపల్లి రమేశ్, ఏశాల రాజు, నాగుల సుధాకర్, ఏశాల భూమేశ్, పి.రాజేందర్, నాగుల శ్రీను, కాల భోజన్న, ఎర్రం సుభాష్, నాగుల మహిపాల్, ఏశాల లింగంల ఆధ్వర్యంలో వారి అనుచరులు మున్నూరుకాపు పంథాల నుంచి 250 మంది ప్రతినిధులు శుక్రవారం ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆర్మూర్ మండలం మంథని గ్రామానికి చెందిన గౌడ సంఘం సభ్యులు, పూసల సంఘం, గంగపుత్ర, నాయకపోడ్, నాయిబ్రహ్మణ, రజక, ముదిరాజ్, యాదవ , విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, సభ్యులు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరగా జీవన్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. నందిపేట్ మండలం మల్లారం ఉప సర్పంచ్ నర్సారెడ్డి తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. మంథనికి చెందిన మాదిగ, ఒడ్డెర సంఘం సభ్యులు బీఆర్‌ఎస్‌లో చేరి తమ మద్దతు జీవన్‌రెడ్డికేనని ఏకగ్రీవం తీర్మానాలు చేశారు. వారందరికీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన మంథని విశ్వబ్రాహ్మణ సంఘాల సభ్యులు

# జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం



ఆలూర్ మండలం మచ్చర్లలో ప్రచారం నిర్వహిస్తున్న రజితారెడ్డి

ఆర్మూర్/మాక్లూర్/ఆర్మూర్‌టైన్, నవంబర్24: నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఆశన్నగారి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆలూర్ మండలం మచ్చర్లలో శుక్రవారం ప్రజా ప్రతినిధులు, మహిళలతో కలిసి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాక్లూర్ మండలం చిక్లీ, మామిడిపల్లి, ముల్లంగి(బీ) గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఆర్మూర్ పట్టణంలోని 16, 30 వార్డుల్లో కౌన్సిలర్ రంగన్న, యువజన నాయకులు మీరా శ్రావణ్, స్థానిక యువకులతో ప్రచారం నిర్వహించారు.



భీమ్‌గల్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నింబాచల లక్ష్మీ నర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొండ ప్రదక్షిణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా గోవింద నామ స్మరణతో నింబాచల క్షేత్రం మార్మోగింది. – భీమ్‌గల్, నవంబర్ 24



ఎన్నిల విధుల్లో పాల్గొన్న అధికారులు

# ఓటు హక్కు వినియోగించుకున్న 49 మంది ఓటర్లు

మాక్లూర్, నవంబర్24: మండలంలో 49 మంది వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు గిర్దావర్ షఫీ శుక్రవారం తెలిపారు. 80 ఏండ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులను ఇంటి వద్దే ఓటువేసే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందని పోలింగ్ అధికారులు తెలిపారు.

## ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

ఆర్మూర్‌టౌన్, నవంబర్24: పట్టణంలోని పెర్కిట్ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉపాధ్యాయుడికి విద్యార్థినుల తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. బాలికలను లైంగికంగా వేధిస్తున్నాడంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాలకు తరలివచ్చి ఆందోళనకు దిగారు. కొన్ని రోజుల నుంచి ఐదో తరగతి విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నాని విద్యార్థినుల తల్లిదండ్రులు, మైనారిటీ యువకులు పేర్కొన్నారు. హెచ్‌ఎం ఆసియా సుల్తానాకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్సీలో ఎంఈవో రాజ గంగారాంకు వినతి పత్రం అందజేశారు.

## ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

బాల్కొండ, నవంబర్ 24: మండల కేంద్రానికి చెందిన గజ్జల విద్యాసాగర్ (55) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గోపి తెలిపారు. కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగోలేకపోవడంతో మనస్థాపం చెంది శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో దూలానికి ఉరి వేసుకున్నాడని పేర్కొన్నారు. మృతుడి కూతురు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# ఇండోర్ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ

ముప్కాల్, నవంబర్ 24 : ముప్కాల్ మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియం కోసం ప్రముఖ పారిశ్రామిక వేత్త, చిట్టాపూర్ గ్రామానికి చెందిన దయానంద్‌రెడ్డి రూ.15 లక్షలు విరాళం అందజేశారు. ఈ మేరకు చైతన్య యువజన సంఘం ఆవరణలో ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం శుక్రవారం భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన దయానంద్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో క్రీడా రంగ అభివృద్ధి కోసం కృషిచేస్తానని తెలిపారు. అనంతరం గ్రామస్తులు దయనంద్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కోమటిరెడ్డి గంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, పీడీ రాజ్‌కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయులు అంజయ్య, టి.సాయన్న, మోతె గంగారెడ్డి, ప్రవీణ్ కుమార్, పీఈటీ శ్యామ్, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ముప్కాల్‌లో ఇండోర్‌స్టేడియం నిర్మాణానికి భూమి పూజ చేసిన దయానంద్‌రెడ్డి